ఎంపిడివో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో తనిఖీ

మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16,ప్రభాతవార్త: బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో ఎల్లయ్య తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పంచాయతీ నిర్వహణ వివరాలు, పారిశుద్య వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈజీఎస్ ద్వారా జరుగుతున్న పనులపై ఎపీవో రాజ్ కుమార్‌ను ఆరాతీశారు. ఉపాధి హామి పనులపై పలు సూచనలు చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. రాజీవ్ యువ వికాసంకు 1655 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్,ఏపీవో రాజ్ కుమార్, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

అంబేద్కర్‌ని రాజకీయాలకు ముడి పెట్టడం సరికాదు

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), ఏప్రిల్ 16, ప్రభాతవార్త: బి.ఆర్ అంబేద్కర్‌ని రాజకీయాలకు ముడి పెట్టడం సరికాదని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మహానీయుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని రాజకీయం చేయడం సరికాదన్నారు. ఆది వారం దౌల్తాబాద్ మండలం ముబ్రస్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రాజ కీయాలతో ముడిపెట్టడం తగదన్నారు. విగ్రహావిష్కరణలో భాగంగా ర్యాలీ అనంతరం అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే క్రమంలో పూలమాలవేసే సందర్భంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అంబేద్కర్ జెండాను దళిత వ్యక్తికి అందుకోమనిచెప్పి కిందకి ఇవ్వడంతో అదికిందపడటం జరిగిందన్నారు. దానిని రాజకీయ నాయకులు రాజకీయాలకు ముడిపెట్టడం సరికాదన్నారు. జెండాను కిందకు అందజేసి క్రమంలో ప్రత్యేక్ష సాక్షిగా నేను, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యే జెండాను పడేస్తే మేం అక్కడే ఖండించే వారిమన్నారు. అంబేద్కర్‌ని రాజకీయం చేయాలని చూస్తే ఉరుకునేది లేదన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట, ఏప్రిల్ 16,ప్రభాతవార్త : అకాల వర్షాలవల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని పంతుల్‌తండాలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన పొలాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు ఆందోళన చెందవద్దని ఆదుకునేందుకు ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేల సహాయం అందిస్తుందన్నారు. మండలంలోని నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు ప్రభుత్వానికి అప్పగించాలని ఆదేశించారు.వడగండ్ల వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని పూడ్చలేమని,వర్షాల వల్ల ఉత్తర తెలంగాణలో వరి,మామిడి,కూరగాయలు పండించే రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇది ప్రకృతి వైపరిత్యం అని దీనికి ప్రభు త్వం ద్వారా నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు. అతి తర్వలో గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీరు అందిస్తామన్నారు. మండలంలలో 40 నుండి 50 వేల ఎకరాల భూమి సాగుకు యోగ్యం గా ఉందని ప్రస్తుతం 30 వేల ఎకరాలు సాగు అవుతోందన్నారు. రైతులు నష్టపోకుండా ఉండాలంటే ఆయిల్ ఫాంలాంటి పంటలు సాగు చేయాలని రైతు వేదికలలో రైతులకు అధికారులు అవగాహన కల్పించాల న్నారు. భవిష్యత్తులో హుస్నాబాద్ ప్రాంతాన్ని వ్యవసాయ పరంగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు.

భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులు

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : భూభారతి చట్టం పై అవగాహన సదస్సులను నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం భూ భారతి చట్టంపై అదనపు కలెక్టర్ మాధురి(రెవెన్యూ) ఆర్డీవోలు, తహ సీల్దార్లతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టంలో నోటీసు విధానాన్ని అమలు చేయాలని పక్కగా ఉందన్నారు. కొనుగోలు, అమ్మకందారునికి, మ్యుటేషన్ సందర్భంలో నోటీసు విధానాన్ని అమలు చేయాలన్నారు. నోటీసు అమలు చేశాక అభ్యంతరాలు ఉంటే పలువురి వాదనలు విని పోర్టల్ లో అప్లోడ్ చేసి పరిష్కరించాలన్నారు. భూ భారతి లో హక్కుల రికార్డ్ లలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు గాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు. ఈ చట్టంపై ఈనెల 30 వరకు మండలాల్లో అవగాహన సదస్సులను సజావుగా నిర్వ హించాలని అధికారులను ఆదేశించారు. భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తీసుకొచ్చిన భూభారతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, రైతు సంఘాల నాయకులు, సభ్యులను ఈ సదస్సులో భాగస్వామ్యం చేయాలని, చట్టంలో ఉన్న ప్రాధాన్యత అంశాల వివరాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా కరపత్రంపై ముద్రించాలన్నారు.కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, డిఆర్ఓ పద్మజారాణి, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంకోల్ డిటిఎల్‌కు జాతీయ అవార్డు

-అవార్డును అందచేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి

మునిపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

కంకోల్ డిటిఎల్‌కు అవార్డును అందచేస్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరి

డెక్కన్ టోల్‌వేస్ లిమిటెడ్ 2023 సంవత్సరానికి సంబంధించి గ్రీన్ హైవేస్ కేటగిరిలో కంకోల్ డిటిఎల్‌కు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అవార్డును అందచేశారు. జాతీయ రహదారి వెంబడి పచ్చదనం, నీటి సేకరణ, ఇందనం సృష్టి, నీటి నిర్వాహణకు కృషిచేస్తున్న ఫలితంగా అవార్డును అందుకున్నట్లు డిటిఎల్ నిర్వాహకులు తెలిపారు. రహదారి నిర్మాణం, నిర్వహణ ప్రక్రియలో వాటాదారులను గుర్తించి ప్రోత్సహించ డానికి రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చేపడుతున్న సర్వే నిర్వహించి కంకోల్ డిటిఎల్‌ను అవార్డుకు ఎంపిక చేసిందన్నారు.

కార్మిక సంఘం ఎన్నికలో సిఐటియుకు మద్దతు పలకండి

సదాశివపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎంఆర్ ఎఫ్ పరిశ్రమలో కొనసాగే కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికుల హక్కుల కొరకు, సంక్షేమానికి పోరాడే సిఐటియు సంఘానికి మద్దతు పలకాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం పేర్కొన్నారు.బుధవారం పట్టణం లోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఫంక్షన్ హాల్‌లో ఎంఆర్ఎఫ్ కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లేశం మాట్లాడుతూ జిల్లాలోని అనేక పరిశ్రమల్లో కార్మికుల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామని, మెరుగైన వేతన ఒప్పందాలు చేసిన చిత్ర సిఐటియుకే దక్కుతుందన్నారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పోరా టాలు చేసే సిఐటియుకు మద్దతు పలకానలి కార్మికులకు మల్లేశం సూచిం చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి ప్రవీణ్‌కుమార్, ఎంఆర్ఎఫ్ యూనియర్ నాయకులు నర్సింలు, రాజు, రేవణప్ప, బాగా రెడ్డి, రమేష్‌రెడ్డి, వెంకటేశం, ఎంఇ హాజీ, కృష్ణమూర్తి, శాంత కుమార్, విజయవీర్, శివకుమార్, ధనరాజ్, హనుమంతు పాల్గొన్నారు.

ఇడి, మోడీలకు కాంగ్రెస్ భయపడదు

గాంధీ కుటుంబంపై బిజెపి కక్షసాధింపు చర్యలు మానుకోవాలి.. రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : ఈడీ, మోడీలకు భయపడే పార్టీ కాంగ్రెస్ కాదని రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడి చార్జ్ షీట్‌లకు నిరసనగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకం గా ధర్నా నిర్వహించారు. మోడీ, అమీత్‌షా, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి పెరుగుతున్న ఆద రణ, పార్టీ ఎదుగుదలను చూడలేకే మోడీ, అమిత్ షా సోనియా, రాహుల్‌గాంధీలపై కక్షసాధింపు చర్య లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గుజరాత్‌లో జరిగిన ఏఐసిసి ప్లీనరీ సమావేశం అనంతరం కాం గ్రెస్ బిజెపి వ్యతిరేక విధానాలపై నిలదీసినందుకే తమ అగ్రనేతను ఈడీ కేసుల పేరుతో వేదిస్తూ ఇబ్బందులకు గురిచేయడం సిగ్గుచేటన్నారు. బిజెపి చెప్పినట్లు కాంగ్రెస్, గాంధీ కుటుంబం ఆస్తులు సంపాదించుకోవాలంటే వందలాది మంది ముఖ్య మంత్రులు, కేంద్ర మంత్రులు చేసిన అవినీతి బయటపడేది కాదా అని ప్రశ్నించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప పార్టీ కాంగ్రెస్ అని, అలాంటి కుటుంబంపై అనవసరపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. 85 సంవత్సరాలు ఉన్న సోనియాగాంధీని విచారణ పేరుతో ఇబ్బందులు పెట్టడం రాక్షసత్వం అన్నారు. బిజెపి కక్షసాధింపు

మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చర్యలు దేశ ప్రజలకు అర్థమౌతున్నాయని దేశం మొత్తం గాంధీ కుటుంబానికే సానుభూతి తెలుపు తుందని చెప్పారు. గాంధీ కుటుంబం నిజంగా అవి నీతికి పాల్పడితే జైల్లో పెట్టాలి కాని అలా చేస్తే కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా మరింత బలపడుతోందని ఈడి ద్వార ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దేశాన్ని దోచుకుంటున్న నీరవ్‌మోడీలపై చర్యలు తీసుకోక పోగా కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ సంస్థలన్నిటిని అంబాని, ఆదానీలకు అప్పగించడం నిజం కాదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం గాంధీ కుటుంబంపై కక్షసాధింపు చర్యలు మాను కోవాలని లేనిపక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, నాయకులు అక్కు శ్రీనివాస్‌తో పాటు ఏడు మండలాల కాంగ్రెస్ మండల అధ్య క్షులు, ముఖ్యనేతలు, పార్టీ అనుభంద సంఘాల నాయకులు, యూత్‌కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అవార్డు అందుకుంటున్న కిశోర్

ఆరె కిశోర్‌కు దళితరత్న అవార్డు

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : కోహెడ మండలం సముద్రాల గ్రామానికి చెందిన ఆరె కిశోర్‌కు దళిత రత్న అవార్డు వరించింది. ప్రపంచ మేదావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం అందించే దళిత రత్నా అవార్డును కిశోర్ అంబేద్కర్ ఉత్సవ కమిటీ చేతుల మీదుగా అందుకున్నారు.కిశోర్ జాతీయ మాల మహా నాడు హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్‌గా పని చేస్తూ దళితుల హక్కుల కోసం చేసిన పోరాటాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఈ అవార్డుకు ఎంపిక చేసింది.ఈ సందర్భంగా కిశోర్ మాట్లాడుతూ జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు సూచనలు ప్రోత్సాహంతో చేసిన పోరాటాలే వారికి ఈ రోజు అవార్డు రావడానికి కారణమన్నారు. ఉద్యమంలో అనేక రకాలుగా తనకు సహ కరించిన మాలమహానాడు రాష్ట్ర పోలీస్ బ్యూరో చైర్మెన్ ర్యాకం శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి బట్టి సత్యనారాయణ, రాష్ట్ర మాల సాంస్కృతిక సారధి చైర్మెన్ ఎలుక దేవయ్యతో పాటు సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తిలకు కిశోర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు భూ భారతి చట్టంపై అవగాహన

-హాజరుకానున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సదాశివపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: ఈనెల 17న సదాశివపేటలోని దుర్గా ఫంక్షన్ హాల్‌లో భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిద్దన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం అయ్యే అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్, ఆర్‌డిఓలు హాజరవుతున్నారన్నారు. తహసీల్దార్ పర్యవేక్షణలో కొనసాగే అవగాహన కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జయప్రకాశ్‌రెడ్డి గౌరవ అతిథిగా హాజరువుతున్నారన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భూభారతి చట్టంపై అవగాహన పొందాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

గజ్వేల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త): గజ్వేల్ మండలం గిరిపల్లి గ్రామంలో కొన సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి మంజూరైన ఇళ్లసంఖ్య, పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. గ్రామంలో త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని, ప్రతి ఇంటిని 400 నుండి 600 స్క్వేర్ ఫీట్స్‌లో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. లబ్ధిదారులు ఇసుక విష యం గురించి అడుగగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను అందించాలని ఆర్డీవో చంద్రకళకు సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పిడి దామోదర్‌రావు, ఎంపిడిఓ ప్రవీణ్, పంచాయతీరాజ్ డీఈ, ఏఈలు, మండల పంచాయతీ అధికారి దయాకర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు అజారుద్దీన్, మిస్కిన్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇండ్ల నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్

శ్మశానవాటిక... జూదరుల ఆటక ?

-పర్యవేక్షణ లోపం.. ప్రజలకు శాపం.. నీరుగారుతున్న ప్రజాధనం.. పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నారాయణఖేడ్, ఏప్రిల్ 11 ప్రభాతవార్త: పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం జూదానికి కేంద్రాలుగా మారాయి. శ్మశానవాటిక, డంపింగ్ యార్డులలో విచ్చలవిడిగా యువత జూద మాడుతూ పెడదారిపడుతున్నారు.ఊరి చివర ఉండ డం, నిర్మానుష్య ప్రాంతాలు కావడంతో శ్మశాన వాటికని అడ్డాగామార్చుకొని జూదం ఆడుతున్నారు. మద్యం తాగి సీసాలను పగులకొట్టి ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. నారాయణఖేడ్ నియోజక వర్గంలోని పలు గ్రామాల్లో గత ప్రభుత్వం నిర్మిం చిన శ్మశానవాటికలు, డంపింగ్‌యార్డులలో తూతూ మంత్రంగా అరకొర పనులుచేసి సౌకర్యాలు కల్పించ కుండానే అర్థాంతరంగా నిలిపివేశారు. గ్రామాల్లో చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుల్లో వేసి ఎరువును తయారు చేయాలనే సంకల్పంతో గత ప్రభుత్వం ముందుకొచ్చి డంపింగ్ యార్డు, శ్మశానవాటికలు నిర్మించాలని ఆదేశాలు అమలు కాలేదు. అందులో చెత్తను వేయకపోవడం వల్ల జూదం ఆడి, మద్యం తాగడానికి వారు అడ్డగా మార్చుకుంటున్నారు. గ్రామా ల్లో పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాల్సిన బాధ్యతను గాలికి వదిలేశారు. కొన్ని శ్మశానవాటిక లలో బోర్లు వేసినప్పటికీ బోర్లలో మోటర్లు లేని పరిస్థితి ఏర్పడింది. ప్రజాధనంతో ఉపాధి హామీ పథకం ద్వారా శ్మశానవాటికలు నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ ఆశయం ఎంతో మందికి మంచిదైనా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అలసత్వంతో ప్రజాధనం వృధా అయిపోతుంది. శ్మశానవాటికలో అంతిమ కర్మకాండలు తీర్చాలన్న లక్ష్యంతో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక శ్మశాన వాటిక, ఒక డంపింగ్ యార్డ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కానీ పనులు పూర్తికాకముందే పూర్తి చేశా మని డబ్బులను స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వైకుంఠధామాలలో మౌలిక సౌకర్యాలు కల్పనలో భాగంగా విద్యుత్, నీటి సౌకర్యం కల్పిం

శ్మశానవాటికలో జూదం ఆడే పేకలు

శ్మశానవాటికలో వినియోగంలో లేని బోరు

చాల్సిన అవసరం ఉంది. అదేమి చేయకుండానే నిధులు స్వాహా చేశారు. అనేక శ్మశానవాటికలో కనీ సం నీటి సౌకర్యం లేకపోవడం గమన్హర్హం. అధికా రుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే అరకొర పనులు చేశారని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. నారా యణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్, నాగల్‌గిద్ద, కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, నిజాంపేట్, శంకరంపేట్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో శ్మశానవాటికల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. కొన్నిచోట్ల శ్మశాన వాటికలలో ఏర్పాటుచేసిన బోర్లలో మోటార్లు మాయమయ్యా యని వినికిడి. ఒక్కొక్క శ్మశానవాటికకు సుమారు రూ.12 లక్షలు కేటాయించినప్పటికీ నామ్‌కే వాస్తు పనులుచేసి చేతులు దులుపుకోవడం ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధి కారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశానవాటిక, డంపింగ్ యార్డ్‌లను సౌకర్యవంతంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు. డంపింగ్ యార్డ్ నిర్మాణం అయినప్పటికీ వినియోగించుకొని గ్రామ పంచాయ తీలు, పట్టణాలు, గ్రామాలలో వ్యర్థ పదార్థాలను తడి, పొడి చెత్త వేయడానికి నిర్మించిన షెడ్‌లు, డంపింగ్‌యార్డ్ ప్రతిరోజు ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డ్ వద్ద నిలువ చేస్తూ చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ ఎరువు, ఇతర అవసరాల వినియోగం కోసం, యంత్రాల సాయం తో శుద్ధి చేస్తూ, గ్రామాలకు ఆదాయం వచ్చే విధం గా చేయాలి.కంపోస్ట్ ఎరువులు తయారుచేసి ఇతరు లకు విక్రయించడంవల్ల గ్రామ పంచాయతీకి ఆదా యం రాబట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. గ్రామం లో సేకరించిన ప్లాస్టిక్ వివిధ వస్తువులు అమ్మడం వల్ల గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఆదేశాలు ఉన్న ప్పటికీ పట్టించుకోని గ్రామాల్లో పనిచేస్తున్న కార్య దర్శులు. డంపింగ్ యార్డుల వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. పలు గ్రామాల్లో చెత్తను సేకరించి అక్కడక్కడ రోడ్ల పక్కన తగలబెడుతున్నారు. కొన్ని గ్రామాల్లో పొలిమరలో డంపు చేయడంవల్ల మూగ జీవులు ప్లాస్టిక్ వస్తువులు తిని అనారోగ్యం పాలవుతున్నాయి.గ్రామాల్లో సేకరిస్తున్న తడి, పొడి చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా నేరుగా డంపింగ్ యార్డ్‌లోనే వేయాలని ఆదేశాలను పై అధికారులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ నాయకులు

ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సిములు

సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 16 ప్రభాతవార్త : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నుండి కూలీలను, పేదలను దూరం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.నర్సిములు అన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ బకాయిలు వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలనే నినాదాలతో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిములు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేయడం కోసం అనేక రకాల ఇబ్బందులు కూలీలపై మోపు తోందని 2 నెలలగా ఉపాధిహామీ పనులు నిర్వహించిన కూలీలకు డబ్బులు ఇవ్వకపోవడం అందులో భాగమేనని అన్నారు.జిల్లా అధ్యక్షులు బి. రామచందర్ మాట్లాడుతూ...సంవత్సరంలో కూలీలు అడిగినన్ని రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.జయరాజు మాట్లాడుతూ, సిపిఎం ఉపాధి హామీ సమస్యలు వచ్చినప్పుడల్లా పోరాడుతుందని అన్నారు.సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఏ మాణిక్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజయ్య మాట్లాడుతూ.. పేదలు,దళితులు కూలీలుగా పని చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం పేదల నోటికాడి ముద్దను లాక్కునే ప్రయత్నం చేయడం సరేంది కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు యాదగిరి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఏసోబు,జి.నర్సింలు, జి.రాజు, ఎం.రాజు, సుజాత, నర్సింలు, కుమార్, కృష్ణ, రాజేష్, నాగన్న, శ్రీనివాస్, లక్ష్మీ, జ్యోతి, కూలీలు పాల్గొన్నారు. డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని సంబంధిత అధికారులకు అందజేశారు.

కాంగ్రెస్ నేత రొయ్యల పోచయ్య మృతి

దివంగత సిఎం అంజయ్యకు అత్యంత సన్నిహితుడు

రామాయంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీకి నాలుగు దశాబ్దాలకుపైగా సేవలందించిన రామాయంపేటకు చెందిన రొయ్యల పోచయ్య అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. పార్టీకి సైనికుడిగా, కార్యకర్తగా అంకితభావంతో సేవలందించిన ఆయన మృతిపట్ల పలువురు నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. 1971లో కాంగ్రెస్ పార్టీలో అడుగుపెట్టి, ఆంధ్రప్రదేశ్ విభజకు ముందు నుంచే పార్టీ అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితమిచ్చిన పోచయ్య సేవలు మరు వరానివని పలువురు కొనియాడారు.టి.అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయనకు కుడిభుజంగా పనిచేశారు. 1982లో ఎన్ఎస్ యుఐ నుండి జూనియర్ కళాశాల ప్రెసిడెంట్‌గా, 1985లో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఆయన ప్రమాణం కొనసాగింది. 1991లో వార్డు మెంబర్, 1993-94లో పిఎసిఎస్ చైర్మెన్, జిల్లా కోఆపరేటివ్ డైరెక్టర్, 2000 నుండి 2014 వరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, 2010-2014 మధ్య మహాంకాళి దేవస్థానం కమిటీ సభ్యుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. 2015నుండి 2019 వరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా, కాంగ్రెస్ పార్టీకి నేను ఒక సైనికుడిగా ఉండి సేవలందించాను అనే ఆయన మాటలు ఆయన పార్టీపై ప్రేమను ప్రతిబింబిస్తున్నాయి. పార్టీకి అందించిన ఈ త్యాగస్వభావ సేవల్ని మర్చిపోలేమని, వారి మరణం పార్టీకి తీరని లోటని పలువురు క

కులమతాలకన్నా మానవత్వమే గొప్పది : ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్‌పల్లిలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మానవ సేవయే మాధవ సేవ అనే నినాదంతో యువత ముందుకు వచ్చి పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో గురువారం బోయిన్‌పల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్య క్షుడు జంపన ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీగణేష్ ఫౌండేషన్ పేరుతో 15 సంవత్సరాల పాటు చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడంతోనే ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యే అయ్యానన్నారు. మండుటెండలను దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలలో స్వచ్ఛమైన చల్లని నీరును అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సి.సంతోష్ యాదవ్, భద్రినాథ్ యాదవ్, అరుణ్ యాదవ్, రేపాల వెంకటేశ్వర్లు, సదానంద్, మారుతీ గౌడ్, నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

మహిళలను వేధింపులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలి : అడిషనల్ డిసిపి అశోక్

మారేడ్‌పల్లిలో యూనిసెఫ్ ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ నోముల వెంకటేష్

కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తే వెంటనే పోలీసులకు ఽసమాచారం అందించాలని ఉత్తర మండలం అడిషనల్ డిసిపి పగడాల అశోక్ తెలిపారు. యూనిసెఫ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బ్లూ అంబ్రెల్లాను పురస్కరించుకొని సికింద్రాబాద్ జెబిఎస్ ఽసమీపంలోని పికెట్ పార్కు నుంచి మారేడ్‌పల్లిలోని డిసిపి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనర్ బాలబాలికలు లైంగిక వేధింపుకు గురైనట్లైతే వెంటనే పోలీసులకు ఽసమాచారం అందించాలన్నారు. ఫోక్ ్చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్లపై లైంగిక వేధింపులు జరుగకుండా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ నోముల వెంకటేష్, ఎస్.లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు 2 వేల 18

మెహిదీపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు అన్ని కులాల వారికి రాజీవ్ యువ వికాస పథకం ద్వారా రూ.4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తుండడంతో నిరుద్యోగ యువతీ, యువకులు వేలాదిగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈనెల 14వ తేదీ గడువు ముగిసే నాటికి ఆసిఫ్ నగర్ మండల పరిధిలో 2 వేల 18 దరఖాస్తులు రావడం జరిగిందని ఆసిఫ్ నగర్ మండల తహసిల్దార్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ 474, ఎస్టి 27, బిసి 901, ఈబీసీ 05, మైనార్టీ 611 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు.

మరకత శ్రీలక్ష్మీ గణపతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఆలయంలో బ్రహ్మోత్సవం క్రతువు

అల్వాల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: అల్వాల్ కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు జరిగే ఉత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వాహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి పర్యవేక్షణలో జరుగుతాయి. మొదటి రోజు బుధవారం సుప్రభాత సేవ, విశేష అభిషేకం, గోపూజ, కలశస్థాపన, చతురావృత తర్పణాలు, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర స్వస్తి, పుణ్యాహవాచనం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట తదితర క్రతువులను పండితులు నిర్వహించారు. గురువారం సుప్రభాత సేవ, విశేష అభిషేకం, స్థాపిత దేవతా పూజలు ప్రధానంగా ఉంటాయి. ఆఖరి రోజు శుక్రవారం భక్తులుచే మహాలింగార్చన, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, పుష్పయాగం, దీక్షకా మియోకం, శాంతి కళ్యాణం తదితర కార్యక్రమాలు ఉంటాయని డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి పేర్కొన్నారు. అన్నదానం ట్రస్టీకు భక్తులు విరివిగా విరాళాలు అందించాలని ఆయన కోరారు. పూజా కార్యక్రమాలు అన్న వితరణ పాల్గొనదలిచిన వారు ముందుగా ఆలయ నిర్వాహకులను సంప్రదించాల్సి ఉంటుంది.

ఆపన్న హస్తం సిఎం సహాయ నిధి

- పిఎసి చైర్మన్ గాంధీ

లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ

కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: నిరుపేదలకు ఆపన్న హస్తంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటుందని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళి నగర్ కాలనీకి చెందిన మడపతి దివ్యకి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రెండు లక్షల డెబ్బై ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి ఆరెకపూడి గాంధీ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు, అభాగ్యులకు అండగా నిలుస్తూ ఆర్థిక భరోసా నిస్తుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్ని ఇబ్బంది పెడితే ఉపేక్షించేది లేదు : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజల్ని ఇబ్బంది పెడితే ఉపేక్షించేదిలేదనీ కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గానికి చెందిన మహిళలు వచ్చి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. నియోజకవర్గంలో మంచినీరు అందక చాలా ఇబ్బంది పడుతున్నామని, గత పదేళ్ల కాలంలో మంచినీటికి ఎప్పుడు ఇబ్బంది పడిన దాఖలాలు లేవని వాపోయారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బిందెలతో ఏ విధంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందో ఇప్పుడు అలాగే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంచినీరు సరఫరా చేయక పోగా, తామంతా బోర్లు వేసుకుంటే అవి కూడా తీసుకెళ్లిపోయి అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని తాము ఎలా బతకాలని విలపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా అందనీయకుండా వారిపై ఈ విధంగా అక్రమంగా కేసులు పెట్టి వేధించడం ఎంతవరకు సమంజసమని, వారికి మంచినీరు ఇవ్వక వారు

ఎమ్మెల్యే మాధవరంకు తమ గోడును వెల్లబోసుకుంటున్న మహిళలు

వేసుకున్న బోర్లను తీసుకెళ్లిపోయి కేసులు పెట్టడం విచారకరమన్నారు. అధికారులు, కిందిస్థాయి సిబ్బంది మాత్రం నీళ్ల ట్యాంకులను బయటకు అమ్ముకుంటారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరంపర కొనసాగితే మంచినీటి సరఫరా కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వస్తుందని, తక్షణమే ఇటువంటి చర్యలు ఉపసంహరించుకోవాలని, ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా ఊరుకునే ప్రసక్తేలేదని మాధవరం కృష్ణారావు హెచ్చరించారు.

వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి : హర్షద

మహేంద్రహిల్స్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని యూరో కిడ్స్ ప్రీ స్కూల్ ప్రాంచైస్ ఓనర్స్ బండ్రెడ్డి హర్షద సురేశ్‌లు తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ మహేంద్రహిల్స్‌బాలంరాయిలో యూరో కిడ్స్ ప్రీ స్కూల్,స్నేహ డెంటల్ స్కూల్, ఇండియన్ టెంటల్ అసోసియేషన్ (డెక్కన్) బ్రాంచ్ సంయుక్త ఆధ్వర్యంలో డెంటల్ ఉచిత వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు.వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఓనర్స్‌ప్రిన్సిపాల్ దివ్య గౌరిశెట్టి, అసోసియేషన్ ప్రతినిధులు డాక్టర్ వి.అర్జున్ యాదవ్, డాక్టర్ క్రాంతీ రోగులకు వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు

సికింద్రాబాద్ కోర్టుకు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక శ్రీ కిషన్ మాదిగ తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణపై అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం వహించిన నిర్లక్ష్యంతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించినందుకు తోపులాటలో మాదిగ మహిళా అధ్యక్షురాలు భారతి మాదిగ మృతి చెందాడు. దాంతో చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమ కారులపై అక్రమంగా పెట్టిన కేసులకు హాజరైనట్లు కంటోన్మెంట్ ఎమ్మార్పీఎస్ ఇన్‌ఛార్జి ఇటుక శ్రీకిషన్ మాదిగ తెలిపారు.

అనాథ వృద్ధులను ఆదుకోవాలి : సదాకేశవరెడ్డి

మడ్‌పోర్డ్‌లో వృద్ధులకు అన్నదానం చేస్తున్న సదాకేశవరెడ్డి తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: అనాథలు వృద్ధులను హక్కును చేర్చుకొని వారికి సహాయ సహకారాలు అందించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదాకేశవరెడ్డి తెలిపారు. బుధవారం మడ్‌పోర్ట్ లోని వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి : కొంతం దీపిక

జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందితో సమావేశమై కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

అడ్డగుట్ట,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో చెత్తా, చెదారం పేరుకుపోకుండా పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటేషన్ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక సూచించారు. బుధవారం ఆమె తాతాచారి కంపౌండ్‌లో శానిటేషన్ సూపర్ వైజర్లు, జవాన్లు,ఎస్.ఎఫ్.ఏ.స్వచ్ఛ్ ఆటో డ్రైవర్స్‌తో సమావేశమై పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో శానిటేషన్ విభాగం అధికారులు ధనా గౌడ్, జహింగీర్, ప్రేమ్, గబ్బార్ పాల్గొన్నారు.

తులసీ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు సకాలంలో జరిపించాలి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : తులసీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికలను సకాలంలో నిర్వహించాలని స్థానిక బస్తీ వాసులు కోరుతున్నారు. గత 6సంవత్సరాలుగా ఏకగ్రీవంగా సంక్షేమ సంఘం కొనసాగుతూ వస్తుందని ప్రసుత్తం అధ్యక్షుని పదవి కాలం ముగియడంతో తిరిగి కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలను త్వరగా నిర్వహించాలని కోరుతున్నారు. కాలనీ వాసులు అంకిత్ సింగ్, విజయ్‌కుమార్, వెంకటరమణ చారి, కిసన్ సింగ్, కిషోర్ కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక పద్యనాటకాలను పరిరక్షించుకోవాలి

-సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

కార్యక్రమంలో పాల్గొన్న సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ

చిక్కడపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ , కల్పన కళా నికేతన్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా పద్యనాటకోత్సవం కార్యక్రమం గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో నిర్వాహక సంస్థ అధినేత, రంగస్థల కళాకారుడు దొంతి జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని "శ్రీకృష్ణ రాయబారం" లో కర్ణ సందేశం పౌరాణిక పద్యనాటకం 'సత్యహరిశ్చంద్రీయమ్" లో కాటి దృశ్య కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. శ్రీకృష్ణుడుగా వేదవ్యాస వెంకటేశు, కర్ణుడుగా దొంతి జంగయ్య గౌడ్, సత్యహరిశ్చంద్రుడుగా జటగొని శ్రీనివాస్ తమ తమ పాత్రలని అద్భుతంగా నిర్వహించారు. సంగీతాన్ని భాస్కర్ రావు అందించగా, ఆహార్యం, మేకప్ పరమేష్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ హాజరై అద్భుతంగా నాటకాన్ని ప్రదర్శించిన కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో బాలబంధు. ప్రముఖ కవి, రసమయి సంస్థ అధ్యక్షులు ఎం కె.రాము, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ, ప్రముఖ న్యాయవాది పి. శ్రీనివాసరావు , ప్రముఖ వ్యాపారవేత్త, అయోధ్య రామయ్య గారు పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రముఖ కళ పేరిణినృత్యం

- ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ

పేరిణినాట్య శిక్షణా శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మామిడిహరికృష్ణ, రంజిత్‌కుమార్ తదితరులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : కాకతీయుల కాలంనుండి గొప్ప ఆదరణ, అభిమానాన్ని చూరగొన్న, శరీరాన్ని గగుర్గొల్పే నృత్యవిన్యాస కళ పేరిణి నృత్యమని తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ అన్నారు. రవీంద్రభారతి ప్రాంగణంలోని కళాభవన్‌లో తన కార్యాలయంలో బుధవారం ఈ నెల 24నుండి తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్తంగా 45రోజులపాటు ఉచితంగా నిర్వహించబడే పేరిణినాట్య గురుశిష్య పరంపర-2 వేసవి శిక్షణాశిబిరం పోస్టర్‌ను హరికృష్ణ పేరిణి నాట్యాచార్యుడు రంజిత్‌కుమార్, నవ్యజ, శ్రవణ్‌రాజు, లోహిత్, గురుదేవ్, వైష్ణవి, తేజస్విని తదితరులతో కలిసి ఆవిష్కరించి ప్రసంగించారు. పేరిణికి ప్రాణంపోసిన వృత్తరత్నవళి రచయిత జయపసేనాని ఈ కళను నేటితరానికి అందించారని తెలిపారు. రామప్ప దేవాలయ శిల్పభంగిమలు నేటికీ పేరిణి నాట్యశిల్పాలుగా సాక్షాత్కరిస్తున్నాయని, పద్మశ్రీ నటరాజ రామకృష్ణ సంవత్సరాల పరిశోధనల కృషిఫలితమే పేరిణినాట్యం ఆవిష్కరించబడిందని హరికృష్ణ వివరించారు. ఈ శిక్షణాశిబిరంలో పేరిణినాట్యంలో నూతన అంశాల రూపకల్పన, కొత్త కళాకారులకు తాళాలపై అవగాహన, కూర్పు తదితర అంశాల బోధన ఉంటుందన్నారు. ఇందులో ఔత్సాహిక యువకులు, విద్యార్థులు పాల్గొని పేరిణినృత్యాన్ని నేర్చుకొని భావితరాలకు అందించాలని కోరారు.

రాందేవ్ ఆసుపత్రికి ఆదరణ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డు ప్రధానం...

కెపిహెచ్బి కాలనీ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: ఆదరణ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 22వ వార్షికోత్సవ సందర్భంగా ఎక్సలెన్స్ అవార్డ్స్‌లో భాగంగా రాందేవ్‌రావ్ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కె. కమలాకర్‌ని ఈ సంవత్సరం ఎక్సలెన్స్ అవార్డును ఆదరణ ఫౌండేషన్ వారు ప్రకటించారు. ఈ అవార్డు కొరకు వ్యవస్థపాక అధ్యక్షులు రఘునాథ్ బాబు, రేఖి థెరపీ గ్రాండ్ మాస్టర్ లక్ష్మి కమలాకర్‌ని, ఆసుపత్రి సీనియర్ మేనేజర్ కల్పనని ఈ అవార్డు ను ప్రధానం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అత్యం త అనుభవం కలిగిన వైద్య రంగంలో 50 సంవత్సరాల అనుభవం కలిగిన, దేశ రక్షణలో 30 సంవత్సరాల తమ జీవితాలను త్యాగం చేసిన కమలాకర్, ఆర్మీ నుండి రిటైర్ అయ్యాక రాందేవ్‌రావ్ చారిటబుల్ ఆసుపత్రి అభివృద్ధిలో తన అనుభవన్ని రంగరించి, రాందేవ్‌రావ్ ఆసుపత్రిని మరింత ముందుకు తీసుకెళ్లడంలో, తద్వారా సమాజాన్ని సేవ చెయడంలో ముందుంటారు.నిరాడంబరుడు, వినయశీలి అత్యంత క్రమశిక్షణ కలిగిన,ఆదర్శవంతమైన నాయకున్ని సత్కరించుకోవడం ఆదరణ ఫౌండేషన్ భాగ్యంగా భావిస్తుందనీ నిర్వాహకులు తెలియజేశారు.

సంస్కృతి సంప్రదాయాలే తరగని సంపద : దైవజ్ఞశర్మ

నాంపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : ప్రతీఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలు, కళలను కాపాడుకోవాలని, అవే మనకు ఎన్నటికీ తరగని జాతిసంపదని ప్రఖ్యాత సంఖ్యాశాస్త్ర నిపుణుడు, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ ఉద్బోధించారు. ఉజ్వల సంస్థ రాష్ట్ర రాజధానితోపాటు దేశరాజధాని ఢిల్లీలో కూడా వివిధ ప్రముఖ సాంస్కృతిక, సంప్రదాయ కళాప్రదర్శనలు నిర్వహిస్తూ ఆయారంగాల్లోని వారిని ప్రోత్సహించడం హర్షదాయకమని, మున్ముందు జాతీయస్థాయిలో వివిధ రాష్ట్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని సంస్థకు, నిర్వాహకుడు సతీష్‌కు శుభాశీస్సులందజేశారు. ప్రముఖ సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ డివోషనల్ గ్రూప్ సహకారంతో సీనియర్ పాత్రికేయుడు ఎన్.సత్యనారాయణ యాదవ్ (సతీష్) నేతృత్వంలో వివిధరంగాల్లో విశేషసేవలందించిన ప్రముఖులకు ఉజ్వల ఉగాది నంది పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దైవజ్ఞశర్మ విశిష్ట అతిథులు కేరళ జ్యోతిష్యనిపుణుడు శివనరసింహన్ తాంత్రి, పారిశ్రామికవేత్తలు పార్థసారధిరెడ్డి, బాలరాజ్‌గౌడ్, గురుస్వామి రాజు, వసంతరాయులు, శ్రీలత, సంస్థ అధ్యక్షురాలు ఎం.లక్ష్మి తదితరులతో కలిసి ఆయారంగాల్లో అద్వితీయ సేవలందిస్తున్న సేవామూర్తులను ఘనంగా సత్కరించి ఉజ్వల ఉగాదినంది పురస్కారాలను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు.

ఉజ్వల ఉగాదినంది పురస్కారంతో సేవామూర్తులను సత్కరిస్తున్న దైవజ్ఞశర్మ, శివనరసింహన్, పార్థసారధిరెడ్డి, లక్ష్మి తదితర అతిథులు

ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోతున్న వారికి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ప్రాంతంలో చేపడుతున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్ట పోతున్న మజీద్, దర్గాలకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడంతో పాటు తగిన న్యాయం చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బుధవారం బోయిన్‌పల్లి చౌరస్తాలోని దర్గా వద్ద ముస్లిం మైనార్టీలు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ట్రాఫిక్‌కు క్రమబద్ధీకరించేందుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో నష్టపోతున్న ఇండ్ల స్థలాల యజమానులకు మజీద్,దర్గాలు, గ్రేవ్ యార్డ్‌లకు నష్టం జరుగకుండా తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కారిడార్ నిర్మాణంలో ప్రైవేట్ స్థలాలతో పాటు ప్రార్థన స్థలాలు కూడా నష్టపోతున్నాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ జిలా ్ల కలెక్టర్ హెచ్ఎండిఏ, రెవెన్యూ, ఉన్నతాధికారులతో చర్చించి ముస్లిం మైనార్టీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం బోర్డు అధ్యక్షుడు అజ్మత్ హుస్సేన్, సిరాజ్, షకీబ్, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నేత ముప్పిడి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి దర్గాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

శతవసంత కుసుమాచరం ఆచార్య బిరుదురాజు రామరాజు

-తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు

నాంపల్లి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : పల్లెపదాల్లో పామరజనాల్లో ఫరిడవిల్లిన సమాజ సంస్కృతుల్లోని మహత్వాన్ని దాక్షినాస్యభాషల్లోనే ప్రప్రథమంగా వెలుగులోకి తెచ్చిన క్రాంతదక్షులు, శతవసంత కుసుమాచరం ఆచార్య బిరుదురాజు రామరాజు అని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందారావు ప్రస్తుతించారు. సాహిత్య అకాడమీ, శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం సంయుక్తంగా నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు సభాధ్యక్షతన నిర్వహించిన బిరుదురాజు రామరాజు శతజయంతి-సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నిత్యానందరావు ప్రసంగిస్తూ జానపదాన్ని అందలం ఎక్కించి అక్షరాభిషేకం చేసిన అమృతమూర్తని, జానపదం జ్ఞానపదమంటూ వివిధ విశ్వవిద్యాలయాల్లో విశిష్ట పరిశోధనా విభాగంగా విరాజిల్లుతూ మూడు నాలుగు వందలకుపైగా పరిశోధనలు గ్రంథాలు వెలువడడానికి చూపిన దోవ రాజమార్గమన్నారు. ఎక్కడో మూలుగుతున్న ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్యాలను ఎన్నింటినో సేకరించి వెలుగులోకి తెచ్చిన పరిశోధకకర్తని కొనియాడారు. అలాగే ఎన్నో అపూర్వగ్రంథాలను తొట్టతొలిసారిగా లోకానికి పరిచయం చేశారని, మరుగుపడిన మాణిక్యాలను చరికెక్కిన చరితార్థులుగా మార్చగలిగిన పరుశవేధితనం ఆశ్చర్యదాయకమని తెలిపారు. ఆయన కాంగ్రెస్ కార్యకర్తగా ఉద్యమాల్లో చూపిన తెరువ, కనబరిచిన ఆసక్తి, సమాజ గనమానపట్ల వారికున్న అవగాహనకు దర్పణమని వివరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగుశాఖ అధ్యక్షుడుగా, అధ్యాపకుడుగా, ఆచార్యుడుగా చూపిన ధీక్షాదక్షత లు, కాకతీయ విశ్వవిద్యాలయ ఆవిర్భావంలో రూపురేఖలు తీర్చిదిద్దిన ఆయన సామర్థ్యం, దూరదృష్టి నేటికీ ఆదర్శప్రాయం, అనితరసాధ్యమని స్పష్టం చేశారు. ఎవరినీ యాచించని ఆత్మాభిమానం, నిలబెట్టుకున్న ఆత్మగౌరవం అభినందనీయం, అపూర్వాంశమన్నారు. అఖిలభారతస్థాయిలో జాతీయ పరిశోధనాచార్యులుగా రామరాజు పొందిన అరుదైన గౌరవం తెలుగునాట అద్వితీయం, నిరుపమానమని పేర్కొన్నారు. బిరుదురాజు రామరాజు లెక్కకుమిక్కిలిగా పొందిన సన్మానాలు, సత్కారాలు, పురస్కారాలు జీవితంలో పండించుకున్న ఉన్నతత్వానికి, సాధించుకున్న ఉత్తమమత్వానికి ఎత్తిన విజయకేతనమని విశదీకరించారు. అనంతరం సాహిత్య అకాడమీ తెలుగుసలహా మండలి సంచాలకురాలు సి.మృణాళిని స్వాగతోపన్యాసం కావించగా అమ్మంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిరుదురాజు రామరాజు సారస్వత వ్యాసములను ఆవిష్కరించారు. తదపరి రెండు సమావేశాల్లో సదస్సు నిర్వహించగా సాయంత్రం ముగింపు సమావేశంలో బిరుదురాజు రామరాజు శతజయంతి స్మారక సంచిక నివాళిని ఆవిష్కరించారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న కాంగ్రేస్‌నాయకులు

సిద్ధిపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

సిద్ధిపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : అధికారంలో ఉన్నామన్నా అహంకారంతో కాంగ్రెస్‌పార్టీ ఆధిష్టానం నాయకులపై మోది ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు ప్పాడుతుందని ఆపార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, బొమ్మల యాదగిరి అన్నారు. బుధవారం పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తాలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడి కోర్టులో చార్జిషీట్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశ సేవకే తమ ప్రాణాలను లెక్కచేయని కుటుంబాన్ని మోది ప్రభుత్వం మానసికంగా వేదిస్తుందన్నారు. అధికారం దుర్వినియోగం చేస్తున్న మోది ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు త్వరలో వస్తాయన్నారు.ఇప్పటికైన అక్రమంగా దాఖాలు చేసిన ఛార్జిషీట్‌ను వెంటనె వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ముద్దం లక్ష్మి,మదు, దాస అంజయ్య, ఎల్లం, సతీష్, సంతోషి, రషద్ గయాజుద్దీన్, వహాబ్, అనిల్, కవిత, మున్నా, హర్సద్, అజ్మత్, రేణుక, రజిని సన కనకయ్య, షాదుల్లా, కొంచెం కనకరాజు, రాజిరెడ్డి, ఖాన్, బాలయ్య తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చేవరకు కాంగ్రెస్‌ను వదిలేదిలేదు

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా ప్రభుత్వంతో కొట్లాడుతానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తోర్నాల గ్రామంలో ఇజీఎస్ నిధులతో వచ్చిన నాలుగు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి ఈనెల 27న నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు.

బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు...

కాంగ్రెస్ పార్టీ తోర్నాల గ్రామ అధ్యక్షుడు తుషాలాపురం బాలయ్యతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే పల్లా సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు.అనంతరం బాలయ్య మాట్లాడుతూ నిరంతరం నియోజకవర్గ ప్రజల కొరకు పోరాడుతూ అనేక కార్యక్రమాలు,సేవలు చేస్తున్న ఎమ్మెల్యేను చూసి ఆకర్షితుడనై బీఆర్ఎస్‌లో చేరానని తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ తన హాస్పిటల్‌కు నియోజకవర్గంనుండి వచ్చిన ప్రతి ఒక్కరికి పైసా ఖర్చు లేకుండా నెలకు సుమారు ఐదువేల మంది వరకు వైద్యం సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బద్దిపడగ కృష్ణారెడ్డి,మంద యాదగిరి, గోనెపల్లి మల్లేశం, మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి రాజమ్మ, మాజీ ఎంపిటీసి ఆకుల యాదగిరి, నాగిళ్ళ తిరుపతిరెడ్డి, తాళ్ళపల్లి బిక్షపతి, నాచగోని వెంకట్‌గౌడ్, చొప్పరి సాగర్‌ముదిరాజ్, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గిరికొండల్‌రెడ్డి

ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : మండలంలోని జాలపల్లి గ్రామం లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి,మాజీ జడ్పీటీసి గిరి కొండల్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో అమ్మా ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా సుమారు నలభై తొమ్మిది లక్షలతో సీసీ రోడ్డు, పాఠశాల ప్రహరీ గోడ పూర్తి చేశా మన్నారు. నేడు ఇరవై ఐదు లక్షల నిధులో సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మరోసారి రుజువు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ చెట్కూరి కమలాకర్ యాదవ్, సాగర్ గౌడ్, రాంరెడ్డి, తిరుపతి యాదవ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

13 ఎల్ కాల్వను రీ డిజైనింగ్ చేయండి

వినతి పత్రం అందిస్తున్న బాదితులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : పట్టణంలోని డబుల్ బెడ్‌రూంల నుండి వెళ్తున 13 ఎల్ కాల్వపనులను నిలిపివేయడంతో పాటు రీడిజైనింగ్‌లో వేరే ప్రాంతం నుండి కాల్వ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ కాల్వలో భూములు కోల్పోతున్న బాదితులు బుధవారం రోజున హుస్నాబాద్ తహసీల్దార్‌తో పాటు ఇరిగేషన్ ఈఈ లకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 ఎల్ కాల్వ ప్రస్తుతం వెళ్తున్న దారిలో నిరుపేద కుటుంబాలకు చెందిన రైతులు ఉన్నారని వారికి ఉన్న 1గుంట,2 గుంటల భూమిని కోల్పోతున్నారన్నారు.ఈ విషయంలో సంబందిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనికరం చూపించడం లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వరకే ఆభూమి కోర్టు కేసులో ఉందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బాదితులు మహేశ్వర్‌రెడ్డి, రాజిరెడ్డి, జాల జ్యోతికుమార్, జాల లక్ష్మయ్య, పోలోజు శ్రీనివాస్, బూరుగు కిష్టస్వామి, నవీన్ తదితరులు ఉన్నారు.

యువతి వివాహానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం

ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :

మండలంలోని జాలపల్లి గ్రామానికి చెందిన నర్మెట సారయ్య బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశం వెళ్లి సంవత్సరం క్రితం అక్కడే మరణించగా అప్పటి నుండి వారి భార్య తన ఇద్దరు కూతుళ్లను కూలీ పనులకు వెళ్లి చదివించుకుంటుంది.అయితే ఇటీవల తన పెద్ద కూతురికి వివాహం కుదరగా సారయ్య భార్య పెళ్లి చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుందనే విషయాన్ని బుధవారం ఆ గ్రామ తాజామాజీ సర్పంచ్ వరలక్ష్మీసాగర్‌లు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వివరించారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సారయ్య కూతరు వివాహానికి తన వంతు సహాయంగా రూ 10వేల ఆర్థిక సహాయం అందించి మంచి మనసు చాటుకున్నారు.సారయ్య కూతరు వివాహానికి ఎమ్మెల్యే విరాళం అందిచడం పట్ల గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇడి ముసుగులో ప్రధాని మోడీ ప్రతీకార చర్యలు

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి

ఐటిసి కార్యాలయం ముందు మాట్లాడుతున్న తూంకుంట ఆంక్షరెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త): ఈడి ముసుగులో ప్రధాని నరేంద్రమోడి ప్రతిపక్ష పార్టీలపై ప్రతీకార చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లు విమర్శించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని సమీకృత భవన సముదాయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం ప్రధాని నరేంద్రమోడి దుర్మార్గపు చర్యలకు ఒడిగడుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను తన చెప్పుచేతుల్లో ఉంచుకుంటూ నిర్వీర్యం చేస్తున్న ఆయనకు దేశ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రధాని మోడి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో నిలదీస్తున్న ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై కక్ష తీర్చుకుంటున్నట్లు ఎద్దేవ చేశారు. 2012లో అప్పటి బిజెపి ఎంపి సుబ్రహ్మణ్యస్వామి ఫిర్యాదు చేయగా, 13 సంవత్సరాల అనంతరం ఈ అంశాన్ని తెరపైకి తేవడంలో ఆంతర్యాన్ని అర్థం చేసుకోవచ్చన్నారు. ఈనెల 25న నేషనల్ హెరాల్డ్ పత్రిక అంశంపై నిర్ణయం తీసుకుంటామని ప్రత్యేక కోర్టు ప్రకటించిన నాలుగు రోజుల్లోనే చార్జిషీట్ దాఖలు చేసి వేధింపులకు గురిచేయడం సహించరానిదన్నారు. కులమతాలు, ప్రాంతాల పేరిట దేశంలో చిచ్చు పెట్టడం సరైంది కాదన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమంగా బనాయిస్తున్న కేసులపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సమీర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ బాధ్యులు అజార్, సురేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, బెజుగామ శివారెడ్డి, నర్సింహారెడ్డి, గుంటుకు శ్రీనివాస్, గాడిపల్లి శ్రీనివాస్, నేత నాగరాజు, అంజద్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, చెప్యాల శేఖర్, డప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం

ఇంటి పన్నులో 5శాతం రిబేట్‌ను వినియోగించుకోవాలి

-మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త): 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5 శాతం రిబెట్‌ను మున్సిపల్ ప్రజలు వినియోగించుకోవాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సెంట్ జోసెఫ్ పాఠశాల వారు 5 శాతం రిబెట్‌లో ఒక లక్ష 67,430 రూపాయల పన్ను చెల్లించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఓ, ఆర్ఐ, బిల్ కలెక్టర్, వార్డు ఆఫీసర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన పల్లా

ధూళిమిట్ట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : మండలంలోని లింగాపూర్ గ్రామంలో బిఆర్ఎస్‌పార్టీ కార్యకర్త తాటికొండ శేఖర్‌రెడ్డి అమ్మమ్మ మెదిని వెంకటవ్వ, జాలపల్లి గ్రామంలో గ్రామ బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు నాగులపల్లి సంపత్ తండ్రి రామయ్య,ముస్తఫా నానమ్మ చాంధ్ బిలు ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం బాధిత కుటుంబాలను ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారా కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.పరామర్శించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 16,ప్రభాతవార్త: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేటలో, గవ్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. రైతులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యం క్రయ విక్రయాలు జరపాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలిపారు. ధాన్యం తూకంలో పారదర్శకంగా ఉండాలన్నారు. రైతులు ధాన్యాన్ని తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు2320, సాధారణ రకానికి రూ.2300 చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్లు అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన చైర్మన్ గిరిధర్‌రెడ్డి

ఝరాసంగం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్‌స్వామి కుమార్తె వివాహం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహ వేడుకలకు రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హన్మంతరావు పాటిల్, నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశం, నాయకులు ఉదయ్ శంకర్ పాటిల్, అశ్విన్ పాటిల్, శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయ కమిటి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ ధర్మకర్తలు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

మెడిసిటీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

గజ్వేల్, ఏప్రిల్ 16 (ప్రభాతవార్త): పట్టణంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో మెడిసిటి ఆసుపత్రి వైద్యులు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌తో పాటు పలు ప్రాంతాలకు చెందిన వెయ్యి మందికి పైగా రోగులు వైద్య సేవలు పొందారు. మొదటగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు 10 లక్షల వరకు వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సాహితి, డాక్టర్ అనిమీష, డాక్టర్ అమూల్య, డాక్టర్ రిషిత, డాక్టర్ హర్ష, డాక్టర్ సంతోష్, డాక్టర్ దీక్షిత, డాక్టర్ అఖిలేష్, డాక్టర్ డేనియల్, డాక్టర్ నవ్య, డాక్టర్ డింపుల్‌లు పాల్గొని గుండె, చెవి, ముక్కు, గొంతు, కీళ్ల నొప్పులు, చర్మ, దంత, నరాలు, సాధారణ తదితర వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మైనార్టీసెల్ మాజీ అధ్యక్షుడు సమీర్, నాయకులు జంగం రమేష్‌గౌడ్, సుఖేందర్‌రెడ్డి, నంగునూరి సత్యనారాయణ, గుంటుకు శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాదగిరి, ఏఎంసి డైరెక్టర్లు డాక్టర్ వాహిద్, అక్కారం యాదగిరి, అజ్గర్, అంజద్, బాబురావు, అజార్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్త, సురేష్, గణేష్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా సిఎంఆర్ఎఫ్ :ఎమ్మెల్యే

నర్సాపూర్ రూరల్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త: కాజీపేట గ్రామానికి చెందిన శీలమంతుల యాదమ్మ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ముఖ్య మంత్రి సహాయ నిధి కి దరఖాస్తు చేసుకోగా వారికి మంజూరైన ..25,500/ ఇరవై ఐదువేల ఐదువందల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి హైదరాబాద్ మాదాపూర్ లోని క్యాంపు కార్యాలయంలో లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సునితారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక స్థితి గతులు బాగాలేక వైద్యం చేయించుకునే స్థోమత లేక అనేక మంది అప్పులు చేసి ఇబ్బందుల పాలవుతున్నారు. వారికి సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిగారి సుధాకర్‌రెడ్డి, శీలమంతుల నాగేష్, యాదగిరి, పల్లె వీరేష్, మచ్చుకి రమేష్, నజీర్, బోయిని అశోక్, సిమ్మల్, కొట్టాల రమేష్, తమ్మలి వేణు, తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

మనూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని మాయికోడ్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ కమిటి అధ్యక్షులు చంద్రకాంత్ కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావుఉ పాటిల్, నాయకులు, మాజీ సర్పంచ్‌లు పరమేష్, సంగప్ప, సంజీవులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు అండగా ఉంటాం

-అనాథల వివారాలు సేకరించిన డిడబ్ల్యూఓ, డిసివిఓ

పాపన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని కుర్తివాడలో అనాధలుగా ఉన్న పిల్లలకు అండగా ఉంటామని డిడబ్బుఓ హైమవతి, డిసిపిఓ కరుణశీల అన్నారు. బుధవారం గ్రామంలోని అనాధ పిల్లల పూరిగుడిసెలను పరిశీలించి వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా అధికారులు హైమవతి, కరుణశీలలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన భూతిపురం రవి గతంలో ప్రమాదావశాస్తు మరణించాడని, మృతుడి ఇద్దరు కుమార్తెలు, కొడుకులను పోషించే స్థోమత లేక తల్లి సంపూర్ణ సంతానాన్ని వదిలేసి వెళ్లిపోవడంతో ముగ్గురు అనాధలుగా మారిపోవడంతో ఇద్దరు అమ్మాయిలను బంధువులు, కుమారుడిని వసతి గృహంలో ఉంటున్నాడని, వేసవి సెలవును పురస్కరించి స్వగ్రామానికి వచ్చి పూరిగెడిసెలో ఉండే పరిస్థితి లేకపోవడంతో విషయాన్ని తెలుసుకుని గ్రామానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారని సిడిపిఓ సూపర్‌వైజర్‌లు తెలిపారు.

కుర్తివాడలో అనాధల వివరాలను సేకరిస్తున్న అధికారులు

బిసి బిల్లును పార్లమెంటులో ఆమోదింప చేయాలి

బహుజన లిబరల్ ఫ్రంట్ చైర్మన్ శ్రీరాం రామకృష్ణ ప్రభు

మాట్లాడుతున్న బిసి నాయకులు

దుబ్బాక (అక్బర్‌పేటభూంపల్లి), ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

దేశ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాల గడుస్తున్న బీసీలకు సరైన వాటా దక్కడం లేదని బీసీల సాధన కోసం ఢీల్లిలో బత్తుల సిద్దేశ్వర పటేల్, జక్కని సంజయ్ నేతలు అమర నిరాహారదీక్షకు బీసీల సంపూర్ణ మద్దతుని బహుజన లెబరల్ ఫ్రంట్ చైర్మన్ శ్రీరాం రామకృష్ణ ప్రభు అన్నారు. దుబ్బాక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బిసి ఉద్యయ నేతతో కలిసి ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో మాట్లాడరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనాభా ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హమీ మేరకు బీసీల వాటా తేల్చాల్సిందేనని అన్నారు. స్వాతంత్రం రాకముందు జరిగిన కుల గణన నిర్ధేవంతోనే పరిపాలన కార్యాచరణ జరిగిందన్నారు. అనేక ఉద్యమాల ఫలితంగానే నేడు కాంగ్రెస్ పార్టీ ఇస్తానన్న 46 శాతం బీసీల రిజర్వేషన్ అమలు చేయాలని, దీన్ని పార్లమెంట్లో బీసీ బిల్లు ఆమోదింప చేయాలని బీసీ ఉద్యమకారులు ముందుకు రావాలని, బీసీల అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటం యోధులకు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన తో పాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 46శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, తమ హక్కుగా బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాలలో బీసీల వాటా కేంద్ర ప్రభుత్వాలు తేల్చాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యమకారులు వెంకట చారి, దివిటి చంద్రయ్య, సుమన్, రాజేందర్, సత్య నారాయణ, న్యాయవాదులు కాస్తి శ్రీనివాస్, ఉంపేదర్, రాజశేకర్, ముత్యాలు, రాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శారద

మహిళా హక్కుల పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలి : ఐద్వా జిల్లా కార్యదర్శి శారద

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : మహాత్మ జ్యోతిరావుపూలే, బిఆర్ అంబేద్కర్ యాదిలో జరిగే మహిళా హక్కుల పరిరక్షణకోసం జరుగుతున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర (ఐద్వా) జిల్లా కార్యదర్శి అత్తిని శారద పిలుపునిచ్చారు.బుధవారం రోజున సంఘం సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 14న మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర ప్రారంభమైందని అన్నారు. ప్రారంభమైన ఈ యాత్ర 20వ తేదీ వరకు నిర్వహిస్తుండగా ఈనెల 18వ తేదీన సిద్దిపేట జిల్లాకు చేరుకుంటుందని 19న సిద్దిపేటలోని పాత బస్టాండ్ వద్ద పూలే,అంబేద్కర్‌లకు నివాళి అర్పించి మహిళలకు ఉన్న హక్కుల గురించి రాజ్యాంగంలో వారికి కల్పించిన అవకాశాలను గురించి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు విగ్నేశ్వరి, నర్సవ్వ, లావణ్య, కవిత,ధరణి ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

అగ్ని ఆర్పే విదానాన్ని వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త : ప్రజలు అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండడంతోపాటు ప్రమాదం జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలి, ప్రాణ, ఆస్థి నష్టాలను ఎలా తగ్గించాలనే అంశాలపై అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ ఫైర్‌స్టేషన్ ఇంచార్జీ పరమేశ్వర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని సురక్ష, శ్రీనివాస్, వెంకటేశ్వర ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి సిబ్బంది వివరించారు. ఆసుపత్రులలో అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయాలలో తప్పించుకునేందుకు లిఫ్టులు,ఎలక్ట్రికల్ వస్తూలను వాడకూడదని,ఆసుపత్రులలో ఉండే ఫైర్ మిషన్ల ద్వార మంటలు ఆర్పే విధానాన్ని వివరించారు.ప్రమాదాలు సంబవించిన వెంటనే 101 నంబర్‌కు సంప్రదించి వారి సహాయం పొందాలన్నారు.

నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లిఖార్జునరెడ్డి

అక్కన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : అకాల వర్షానికి వరిపంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ అయిలేని మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం మండలంలో కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతుల పొలాలను, కొనుగోలు కేంద్రాలను పార్టీశ్రేణులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో రైతులు నష్టపోతే కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాంతం నుండి ఎమ్మెల్యేగా గెలిసి మంత్రి అయిన పొన్నం ప్రభాకర్ అందుబాటులో ఉండకపోవడంవల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంట నష్టపోయిన రైతుల విషయంలో మంత్రి వెంటనే స్పందించి వారికి నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాకాల శ్యాంసుందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్ఓసి చెక్కు అందజేత

సిద్దిపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన దేశెట్టి కలవ్వకు ఆనారోగ్య ఖర్చుల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి,సిద్దిపేట ఎమ



మాజీ మంత్రి గీతారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మాజీ మంత్రి గీతారెడ్డిని కలిసిన నాయకులు

జహీరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మాజీ మంత్రి డాక్టర్ జెట్టి గీతా రెడ్డిని బుధవారం సికింద్రాబాద్‌లోని ఈస్ట్ మారెడ్‌పల్లిలోని స్వగృహంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై మాజీ మంత్రి గీతారెడ్డి కాంగ్రెస్ నాయకులతో ఆరా తీశారు. గీతారెడ్డిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పి.నర్సింహారెడ్డి, మాజీ కో-ఆప్షన్‌సభ్యులు జమహర్షిత్‌పటేల్, మైనార్టీనాయకులు అక్బర్‌హుస్సేన్, మహమ్మద్ జమీలుద్దీన్, ఇమామ్ పటేల్‌లు గీతారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సభ విజయవంతానికి సిద్ధి వినాయకుడికి పూజలు

సభ విజయవంతానికి పాదయాత్ర నిర్వహిస్తున్న బిఆర్ఎస్ నేతలు

న్యాల్‌కల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతంగా పూర్తయ్యేలా ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఆశీర్వదించాలని వేడుకుంటూ బిఆర్ఎస్ నేతలు మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులోని స్వయంభూ శ్రీసిద్ధి వినాయక ఆలయానికి పాదయాత్రగా చేరుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోహన్‌రావు, వినోద్, ప్రకాశ్, వెంకటేశ్వర్ మహారాజ్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, ప్రధానకార్యదర్శి మాతంశెట్టి రాజ్‌కుమార్, హద్నూర్ సొసైటీ డైరెక్టర్, హద్నూర్ గ్రామ బిఆర్ఎస్ కమిటి అధ్యక్షులు ఎంఆర్ ప్రవీణ్‌కుమార్, హద్నూర్ పంచాయితీ మాజీ వార్డు సభ్యులు బోరంచ సంగారెడ్డి, నాయకులు వడ్డి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మేళసంగంలో పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

మేళసంగం పాఠశాలలో ఎస్ఏ-2 పరీక్షలను పరిశీలిస్తున్న భీంసింగ్

మునిపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండలంలో యూ డైస్ ప్లస్ థర్డ్ పార్టీ వెరిఫికేషన్ చురుకుగా కొనసాగుతున్నట్లు మండల విద్యాధికారి భీంసింగ్ పేర్కొన్నారు. థర్డ్ పార్టీ వెరిఫికేషన్‌లో భాగంగా బుధవారం ఎంఈఓ భీంసింగ్ మండల పరిధిలోని మేళసంగం గ్రామంలోని పాఠశాలను సందర్శించారు. జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగుతున్న ఎస్ఏ-2 పరీక్షల నిర్వాహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భీంసింగ్ మాట్లాడుతూ యూ డైస్ ప్లస్ థర్డ్ పార్టీ వెరిఫికేషన్‌కు మండలంలోని 36 పాఠశాలలను ఎంపిక అయ్యాయన్నారు. 36 పాఠశాలలకు 3గ్గురు డైట్ విద్యార్థులను (ఒకొక్కరికి 12 పాఠశాలలు) కేటాయించారని, సహాయకులుగా ముగ్గురు సిఆర్‌పిలు సేవలందిస్తారన్నారు.

సిద్దాపూర్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదాశివపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని సిద్దాపూర్‌లోని డబుల్ బెడ్‌రూం అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్ని ప్రమాదాల నివారణపై అధికారులు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్ని మాపక కేంద్రం అధికారి బిక్షపతి, లీడింగ్ ఫైర్ మాన్ ఎస్‌కె మునాఫ్‌లు అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్ని మాపక సిబ్బంది సాయికుమార్, తయుబ్, చైతన్య కుమార్, నరేష్‌రెడ్డి, నవీన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గజేంద్ర మోక్ష ఆశ్రమంలో అన్నదానం

సిర్గాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండలంలోని అంతర్గాంలోని గజేంద్ర మోక్ష ఆశ్రమంలో బుధవారం సద్గురు దొండో పంత్ దాదాసాహెబ్ మహారాజ్ పుణ్యతిథి కార్యక్రమం శ్రీకరణ్ గజేంద్ర భారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకరణ్ గజేంద్రభారతి మాట్లాడుతూ గురువుల ఆశీస్సులతో భక్తుల జన్మసార్థకమవుతుందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హరిభక్త ప్రియుల ట్రస్ట్ సభ్యులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అతిమ్యాల్‌లో పోషణ పక్వాడా

మనూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని అతిమ్యాల గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, ప్రధానోపాధ్యాయులు జీవన్ రాథోడ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ రక్తహీనత గురించి గర్భిణీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించి 5 సంవత్సరాల వయసు నిండిన విద్యార్థులకు మార్కుల, గ్రేడింగ్ కార్డులను అందచేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు పూలమ్మ, ప్రీతి, ఆయారియానాబేగం, గ్రామ పెద్దలు రాజు, చిన్నారులు, పోషకులు పాల్గొన్నారు.

అతిమ్యాల్‌లో పోషణ పక్వాడా కార్యక్రమం దృశ్యం

మేజర్ పంచాయతీలో మేజర్ సమస్యలు

ఆదాయం ఉన్నా వసతులు సున్నా.. సమస్యల పరిష్కారానికి గ్రామస్థుల ఎదురుచూపులు

కొండాపూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: పేరుకు అది మేజర్ పంచాయతీ. పన్నుల వసూలులో అధికారులు లక్ష్యానికి చేరుకున్నారు. అయినా గ్రామంలోని అపరిశుభ్రతతో గ్రామస్థులు అవస్థలు పడకతప్పడంలేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని మల్కాపూర్ మేజర్ పంచాయతీగా కొనసాగుతోంది. గ్రామాభివృద్ధికి గ్రామస్థులు సైతం తాము చెల్లించాల్సిన పన్నును సకాలంలో చెల్లిస్తున్నా అధికారులు సమస్యల పరిష్కారంలో తమకేం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని వీధులు అపరిశుభ్రతకు నిలయంగా మారాయి. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇరుపక్కలో చెత్త, చెదారం పేరుకుపోవడంతో అటుగుండా ప్రయాణించేందుకు ప్రజలు ముక్కులు మూసుకుంటూ పోవాల్సిన దయనీయ స్థితి నెలకొంది. గ్రామంలో కొత్తగా ఏర్పడిన కాలనీల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. కొత్త కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉండటంతో వర్షం కురిసిన ప్రతి సారి ప్రజలు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. ఇళ్ల మధ్య, ముందు నుంచి మురుగునీరు ప్రవహించడం గ్రామంలో పరపాటిగా మారింది. వర్షం కురిస్తే సంతోష పడాలో, మురుగునీరు ఇండ్ల ముందు నుంచి దర్వాసన వెదజల్లుతూ ప్రవహిస్తోందని బాధపడాలో తెలియక ప్రజలు అయోమయానికి గురవుతున్నారు.

సంబంధిత అధికారులు స్పందించి మేజర్ పంచాయతీలో మేలైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు వినతి చేస్తున్నారు.

కొండాపూర్ పంచాయతీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం



వడ్డి అంగన్‌వాడి కేంద్రంలో పోషన్ పక్వాడా దృశ్యం

వడ్డి గ్రామంలో పోషణ్ పక్వాడా

న్యాల్‌కల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని వడ్డి గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రంలో బుధవారం పోషన్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గర్భిణ స్త్రీలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు కమల, నవీన, మంగళ, పంచాయితీ కార్యదర్శి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

నాగల్‌గిద్ద, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని కరస్‌గుత్తిలో సక్కర్ నాయక్‌తండాకు చెందిన మారుతి కుటుంబ సభ్యులకు ప్రమాద భీమా చెక్కును బుధవారం పంపిణి చేశారు. బ్యాంక్‌తో ఖాతా ఉన్న మారుతి ఇటీవల మృతి చెందడంలో మృతుడి కుటుంబానికి సంగారెడ్డి జిల్లా ఏజీఎం, రీజనల్ మేనేజర్ పింగళి సమత స్థానిక బ్యాంక్ అధికారులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు 20లక్షల ప్రమాద భీమా చెక్కును అందచేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ టీజీబీ బ్యాంక్ మేనేజర్ వినయ్‌కుమార్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్ పాటిల్, నాయకులు శోపన్‌రావు, గురుస్వామి పాల్గొన్నారు.

శవ పేటిక పంపిణీ

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: అలయన్స్ సిద్దిపేట జిల్లా గవర్నర్ ఈశ్వర్‌చరణ్ నిర్వహణలో శ్రీకృష్ణ క్లబ్ గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గవర్నర్ పెద్ది వైకుంఠం దాతృత్వంతో చేర్వాల పట్టణం హిందూ శ్మశాన విటికకు బుధవారం శవపేటిక అందించడం జరిగింది. గతంలో సిద్దిపేట, మిర్‌దొడ్డిలకు శవపేటిక అందించడం జరిగింది. ప్రస్తుతం మూడవది చేర్వాల పట్టణానికి అందించడం జరుగుతందన్నారు. ఈ కార్యక్రమంలో గందె ఈశ్వర్ చరణ్, ఇంటర్నేషనల్ కమిటీ ఛైర్మన్ ఆత్మ రాములు, వనజ, పిఆర్‌ఓ రేణుక, కృష్ణ క్లబ్ గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో దళారులు మాయం : ఎమ్మెల్యే

పాపన్నపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: ప్రభుత్వ ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో గ్రామాల్లో దళారులు మాయం అయ్యారని, ఫలితంగా రైతులు ఆర్థికంగా లబ్దిపొందుతున్నారని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. బుధవారం పొడిచన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, మత్స్య సహకార భవనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ చేసిన హామి మేరకు రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.స్వయం సహాయక సంఘాల మహిళలకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు బాధ్యతలు అప్పగించామని, తద్వార మహిళులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. మత్స్య కార్మికుల ప్రయోజనార్థం భవనం నిర్మించామనానరు. మండలంలోని కొత్తపల్లిలో ఇటీవల మరణించిన త్యార్ల సుజాత సంస్మరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలు పంపిణి చేశారు. ఎమ్మెల్యే వెంట కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ త్యార్ల రమేష్, గోవిందనాయక్, మాజీ జడ్పీటిసి సభ్యులు మల్లన్న, ఏడుపాయల ఆలయ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, పార్శి నర్సింలు, ఆకుల శ్రీనివాస్,సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు



సిసి రోడ్డు పనలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాట్రియాలలో సిసి రోడ్డు పనుల ప్రారంభం

రామాయంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్ చారి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాట్రియాల గ్రామంలో ఎన్ఆర్ఈజిఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్డులకు 15 లక్షల నిదులు మంజూరు కావడానికి సహకరించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఎమ్మెల్యే సహకారంతో కాట్రియాల గ్రామానికి 55 లక్షల వరకు సిసి రోడ్ల కు నిధుల మంజూరు అయ్యాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్దరాములు, పెంటయ్య, హనుమండ్లు, చంద్రం, ద్యాగల సిద్దరాములు, ఎల్లం, రామయ్య, రాజయ్య, దుర్గానాయక్, కట్ట బాబు, శ్యామయ్య, శ్యాములు, దశరతం, కుమార్, నరేష్, బాబు, రాజు, సంజీవులు, సతీష్, శ్రీకాంత్, శ్రీధర్,అనిల్, రంజిత్‌తో పాటు గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల చోరీ ముఠా అరెస్టు, రిమాండ్
వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 16, ప్రభాతవార్త : విద్యుత్ స్తంభాల వైర్లను దొంగలించే ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దొంగతనానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు ఒరిస్సా యూపీ, బీహార్ రాష్ట్రాలకు చెందిన 13 మంది సభ్యులతో కూడిన ముఠా, సంగారెడ్డి జిల్లాలో 11చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారని, దొంగలించిన అల్యూమినియం వైరును అమ్మడానికి వెళ్తుండగా పోలీసులు తనిఖీలలో పట్టు పడ్డారని, వీరి నుండి రెండు లక్షల 20వేల విలువగల అల్యూమినియం వైర్‌ను, దీని తరలి తరలించడానికి ఉపయోగించిన ట్రాలీని కట్టర్లను, సెల్ఫోన్లను స్వాధీనం చేసుకొని, మూఠాలోని 9 మంది సభ్యులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని, మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వెంచర్ యజమానులు కాపలా సిబ్బందిని పెట్టుకోవాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని దీంతో దొంగతనాలను అరికట్టవచ్చునని జిల్లా ఎస్పీ సూచించారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

పోలీసు ఠాణాను తనిఖీ చేసిన ఎస్పి

న్యాల్‌కల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని హద్నూర్ పోలీసు ఠాణాను బుధవారం జిల్లా ఎస్పి పారితోష్ పంకజ్ సందర్శించారు. పోలీసు ఠాణా పరిసరాలను పరిశీలించి ఠాణాలోని రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి పారితోష్ పంకజ్ మాట్లాడుతూ ఠాణాకు వచ్చే ప్రజలతో పాటు ఠాణా పరిధిలోని ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. రాష్ట్ర సరిహద్దులో పోలీసు స్టేషన్ ఉన్నందున నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిఎస్పి రామ్మోహన్‌రెడ్డి, రూరల్ సిఐ జక్కుల హనుమంతు, ఎస్ఐ చల్లా రాజశేఖర్‌లు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి వీడ్కోలు పలుకుతున్న మాజీ ఎమ్మెల్యేభూపాల్‌రెడ్డి

ఉపాధ్యాయుడికి ఘనంగా వీడ్కోలు

కంగ్టి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని దామర్‌గిద్ద పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయులు గుండు నారాయణ వీడ్కోలు సమావేశం పిట్లంలోని సాయిగార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. వీడ్కోలు సభకు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకులు సాగర్ శెట్కార్, డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని ఘనంగా సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. విధి నిర్వహణలో చేసిన సేవలను ప్రజలు కలకాలం గుర్తించుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి సభ్యులు గుండు మోహన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకంత్‌పాటిల్, భరత్‌పాటిల్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

పెద్లచెల్మెడలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం

మునిపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని పెద్దచెల్మెడ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సొసైటీ చైర్మన్ పద్మదుర్గయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పద్మదుర్గయ్య మాట్లాడుతూ రైతులు జొన్న పంటను మధ్యదళారులకు అమ్ముకుని ఆగం కావద్దొని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రానికి తరలించి ఆర్థికంగా లబ్దిపొందాలన్నారు. కేంద్రానికి తరలించిన క్వింటాలు జొన్నలకు 3371 రూపాయలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్రానికి రైతులు జొన్నలను తరలించే ముందు తాలు గింజలు, కల్తీ గింజలు, పొట్లు తదితర వ్యర్థ పదార్థాలు లేకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ పద్మదుర్గయ్య మండల రైతులకు సూచించారు.

ఖమ్మంపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మునిపల్లి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఖమ్మంపల్లిలో బుధవారం 25కెవిఏ మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కొన్నేళ్లుగా ఎదురవుతున్న విద్యుత్ సమస్య పరిష్కారం అయిందని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటయ్యేలా సహకరించిన మంత్రి దామోదర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగమేశ్వర్, ఎల్లగారి రాచన్న, అడివయ్యస్వామి, చీలపల్లి హుస్సేన్, మొగిలిగుండ్ల కృష్ణమూర్తి, టేకూరి నాగరాజు, రాంచంద్రి తదితరులు పాల్గొన్నారు.

కంగ్టిలో ఆలయ శిఖరం ఊరేగింపు



శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయశిఖరాన్ని ఊరేగింపుగా తీసుకుపోతున్న దృశ్యం

కంగ్టి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల కేంద్రంలో శ్రీసిద్ధేశ్వర ఆలయ శిఖరం శోభాయాత్ర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సిద్ధేశ్వర మఠంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మఠం నుంచి గణేష్ మందిరం, విఠలేశ్వర మందిరం వరకు శిఖరాన్ని ఊరేగించారు. 5 రోజులపాటు జాతర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు జాతర ఉత్సవ కమిటి బాధ్యులు పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాలి పటేల్ విఠల్‌రెడ్డి, విద్యాసాగర్ శెట్కార్, మనోజ్ పాటిల్, నాగనాథ్, కృష్ణముదిరాజ్, కాలే రాజు, విశ్వనాథ్, జగన్నాథం, శ్రీనివాస్ రెడ్డి, బాపురావు, సిద్ధేశ్వర ఆలయ కమిటి చర్మన్ దారం వెంక్న పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయంతం చేయండి : ఎమ్మెల్యే

టేక్మాల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: బిఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా ఈ నెల 27న నిర్వహించనున్న వరంగల్ సభను విజయంతం చేయాలని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కోరారు. టేక్మాల్‌లో బుధవారం రజతోత్సవాల వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రం సాధన కోసం టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించిందని, ఎన్నో ఒడిదుడుకులను, కష్టాలను అదిగమించి తెలంగాణ రాష్ట్రాన్ని టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేసీఆర్లో స్వరాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను పదేళ్లపాటు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ముందుకు తీసుకెళ్లడంలో కేసీఆర్ తనదైన శైలితో ముందుకు సాగారని కొనియాడారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు గడుస్తున్న ప్రస్తుత తరుణంలో రజతోత్సవాలను నిర్వహిం చేందుకు పార్టీ వరంగల్ సభను పెద్దఎత్తున నిర్వహించడానికి సంకల్పించిందన్నారు. ఈ సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, తెలంగాణ ఉద్యమకారులు, తెలంగాణ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రజతోత్సవాల సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు సిద్దయ్య,రవి, రజాక్, సాయిబాబా, మల్లేశం, సలావోద్దీన్, సాయిలు, సంగయ్య, బాలకృష్ణ, నారాగౌడ్, తదితరులు ఉన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

రామాయంపేట, ఏప్రిల్ 16, ప్రభాతవార్త : రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళ అభివృద్ధికి కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు విమర్శించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రామాయంపేటలో అంగన్‌వాడీ పోషణ పక్షం, బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాది ప్రజల ప్రభుత్వమన్నారు. గత పది సంవత్సరాలు పాలించిన నాయకులు అంగన్‌వాడీ టీచర్లను,ఆయాలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చదువుకునే పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు.రామాయంపేట ప్రాంతంలో విద్యార్థుల కోసం 20 నుండి 25 ఎకరాల వరకు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టామన్నారు. ఈ ప్రాంతం పిల్లలు బాగాచదువుకొని ఉన్నత స్థానాలకు వెళ్లాలనే ఉద్దేశంతోనే ఈ నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. మెదక్ నియోజకవర్గంలో వైద్యపరంగా పేద రోగుల కోసం మందులు అందుబాటులో ఉండే విధంగా మెదక్‌లో సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ జిల్లా అధికారి హేమలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు పౌష్టికాహారంలో ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, గుడ్లుతోపాటు పలువిధాల కూరగాయల భోజనంతో కూడినటువంటి సమతుల్య ఆహారాన్ని అందిస్తునట్లు పేర్కొన్నారు. పుట్టిన పిల్లలకు ఆరు నెలల పాటు తల్లిపాలు పట్టించాలన్నారు. పుట్టిన పిల్లలకు రెండు సంవత్సరాలవరకు ఆహారం, ఆర్యోగం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి సూచించారు. అదేవిధంగా బేటీ బచావో బేటి పడావో అనే కార్యక్రమం ద్వారా సమాజంలో చాలామంది అమ్మాయిలు వివక్షతకు గురవుతున్నారని తెలిపారు. అమ్మాయిలు ఎదిగిఎదగని వయసులో బాల్య వివాహాలు జరిపిస్తే పుట్టబోయే పిల్లలు వికాలాంగులుగా పుట్టే అవకాశాలు ఉంటాయన్నారు. కడుపులో బిడ్డ పెరుగుతుండగానే కొందరు భ్రూణ హత్యలు చేస్తున్నారని ఇలాంటివి సమాజంలో పురుషులైనా, మహిళలైన నిర్మూలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహశీల్దార్ రజనీకుమారి, ఎంపీడీవో శాజీలొద్దిన్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, రామాయంపేట సిడిపివో స్వరూప రాథోడ్, కాంగ్రెస్ నాయకులు చౌదరి సుప్రభాతరావు, సరాపు యాదగిరి, దేమే యాదగిరి, చింతల యాదగిరి, పోచమ్మల అశ్విని, అల్లాడి వెంకటేష్, సుందర్‌సింగ్, వినయ్ సాగర్, విద్యాసాగర్, నాగులుగౌడ్‌తో పాటు ఆయా గ్రామాలకు చెందిన అంగన్వాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

అతిమ్యాల్‌లో ఆగని చోరీలు

6 నెలల్లో 3 దొంగతనాలు.. భయాందోళనలో గ్రామస్థులు

మనూర్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని అతిమ్యాల్‌లో వరుస దొంగతనాలు చోటుచేసుకోవడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు.ఆరుమాసాల్లో పట్టపగలే ఇంటి తాళాలు పగలకొట్టి మూడు యదేశ్చగా చోరీలు జరిగాయి.దీంతో గ్రామస్థులు ఇళ్లకు తాళాలువేసి పనులు చేసుకునేందుకు, వ్యవసాయ క్షేత్రాలకు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు జంకుతున్నారు. గ్రామానికి చెందిన చాంద్‌గోరి ఇంట్లో 4 తులాల బంగారం, పుట్టి